sahanamvande.com

సహనం వందే

epaper.sahanamvande.com

హైదరాబాద్ | 16-09-2026 బుధవారం | సంపుటి-02 సంచిక : 152 EDITOR: ROHINI

అవయవదానంలో ఆడదే బలిపశువు

64% స్త్రీలు దాతలు, 70% మగ గ్రహీతలు



- భర్తలకు భార్యలే 91 శాతం ఆర్గాన్ డోనర్లు
- పిల్లలకు తల్లులే 73 శాతం అవయవ దాతలు
- నేషనల్ ఆర్గాన్, ట్రాన్స్‌ప్లాంట్ సంస్థ వెల్లడి
- స్త్రీలు ఇతరులపై ఆధారపడడటం వల్లే ఇలా!
- బంధాల వెనుక బలవంతపు దానం!



ఇంట్లో ఎవరికైనా ఆరోగ్య సమస్య వస్తే చాలు... ప్రాణాలైనా ఇచ్చేసేందుకు ముందుకొచ్చేది ఎవరు? నిస్సందేహంగా ఇంట్లోని ఆడవాళ్లే. కానీ అదే ఆడవాళ్లకు అవయవం అవసరమైతే ఎంతమంది మగాళ్లు ముందడుగు వేస్తున్నారు? మన సమాజంలో అవయవ దానంలో కూడా తీవ్రమైన లింగ వివక్ష నడుస్తోంది. ఆడవాళ్ళు అవయవాలు ఇవ్వడానికే పరిమితం అవుతుంటే, మగవాళ్ళు వాటిని పొందడంలో ముందుంటున్నారు. అసలు మన వ్యవస్థలో ఏం జరుగుతోంది? ఇష్టపూర్వకంగా ఇస్తున్నారా లేక త్యాగం పేరిట బలిచేస్తున్నారా?

- సహనం వందే, హైదరాబాద్

దేశంలో అవయవ మార్పిడికి సంబంధించిన డేటాను పరిశీలిస్తే మైండ్ బ్లాంక్ అవ్వాల్సిందే. నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (నోటో) విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2019-23 మధ్య కాలంలో లైవ్ ఆర్గాన్ డోనర్లలో ఏకంగా 63.8 శాతం మంది మహిళలే ఉన్నారు. కానీ ఆ అవయవాలను తీసుకుని ప్రాణాలు నిలబెట్టుకున్న వారిలో 69.8 శాతం మంది పురుషులే కావడం గమనార్హం. అంటే గడిచిన ఐదేళ్లలో నమోదైన 56,509 డోనర్లలో 36,038 మంది మహిళా దాతలు ఉన్నారు. అయితే మహిళలు ఇచ్చిన ఈ అవయవాల్లో కేవలం 17,041 మాత్రమే తిరిగి మహిళలకు దక్కగా, మిగిలిన 39,447 అవయవాలు పురుషులకు మార్పిడి చేశారు.అంటే మహిళలు కేవలం దాతలుగానే మిగిలిపోతున్నారు తప్ప, వారు అనారోగ్యానికి గురైనప్పుడు వారికి అవయవాలు దక్కడం లేదు.

భర్తలకు భార్యలే 91 శాతం డోనర్లు...

మన ఇళ్లలో సాధారణంగా భార్య లేదా తల్లి తమ కుటుంబం కోసం దేనికైనా సిద్ధపడాలనే ఆలోచనను చిన్ననాటి నుంచే నూరిపోస్తారు. ఫలితంగా కుటుంబ సభ్యుడి ప్రాణం ప్రమాదంలో పడినప్పుడు, ఆ ఇంట్లోని మహిళపై మానసిక భారం పడుతుంది. పిల్లలకు ఇచ్చే అవయవ దానాల్లో తల్లుల వాటా ఏకంగా 73 శాతంగా ఉంది. అలాగే భార్యాభర్తల విషయానికి వస్తే, ఏకంగా 91 శాతం డొనేషన్లు భార్యలే తమ భర్తలకు చేస్తున్నారు. అంటే భర్తకు ఆరోగ్య సమస్య వస్తే భార్య తన అవయవాన్ని ఇస్తోంది కానీ, భార్య అనారోగ్యానికి గురైతే భర్త ముందుకు రావడం చాలా అరుదుగా జరుగుతోంది.

కుటుంబం కోసం త్యాగం...

భావోద్వేగ బంధాలు, కుటుంబం కోసం త్యాగం చేయాలనే ఒత్తిడి వారిని డోనర్లుగా మారుస్తున్నాయి. ఇక పురుషులు డోనర్లుగా మారకపోవడానికి మన సమాజంలోని పితృస్వామ్య ఆలోచనలే ప్రధాన కారణం. చాలా కుటుంబాల్లో పురుషుడే ఏకైక సంపాదనాపరుడు కాబట్టి అతనికి సర్జరీ జరిగితే కుటుంబానికి ఆదాయం ఆగిపోతుందనే భయం ఉంటుంది. ఈ ఆర్థిక ప్రమాదాన్ని తప్పించుకోవడానికి ఇంట్లో సంపాదన లేని మహిళలపై ఆ భారాన్ని నెట్టేస్తుంటారు.

స్త్రీలు ఇతరులపై ఆధారపడడటం వల్లే...

మహిళలు ఆర్థికంగా ఇతరులపై ఆధారపడి ఉండటం వల్ల వారు మరింత బలహీనులుగా మారుతున్నారు. వైద్య పరీక్షలు, ఆపరేషన్ ఖర్చులు, రికవరీ సమయం ఇవన్నీ లెక్కలేసుకుని కుటుంబాలు మహిళనే డోనర్‌గా ఎంచుకుంటున్నాయి. ఆర్థిక కోణంలో మహిళల ఆరోగ్యం కంటే పురుషుడి సంపాదనకే ప్రాధాన్యత ఇస్తుండటంతో స్వచ్ఛంద దానానికి, బలవంతపు త్యాగానికి మధ్య ఉన్న గీత చెరిగిపోతోంది.

వివక్షను అరికట్టాలంటే...?

ఈ వివక్షను అరికట్టడానికి వైద్యులు అత్యంత కీలక పాత్ర పోషించాల్సి ఉంది. అవయవ దానానికి ముందుకు వచ్చే మహిళలతో డాక్టర్లు ప్రత్యేకంగా మాట్లాడాలి. వారిపై కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టంగా నిర్ధారించుకోవాలి. బాధితురాలు మనస్ఫూర్తిగా ఇస్తోందా లేక వేరే దారి లేక ఒప్పుకుందా అనేది గుర్తించి అవసరమైతే వెనక్కి తగ్గే వెసులుబాటును కల్పించాలని మేధావులు కోరుతున్నారు. త్యాగానికి మారుపేరుగా మహిళలను పొగడడం బాగానే ఉన్నా, ఆ త్యాగమే వారి ప్రాణాల మీదకు రావడం విచారకరం.

దేశవ్యాప్తంగా క్యాన్సర్ డ్రగ్స్ స్కామ్!

నకిలీ ఇంజెక్షన్ల నెట్‌వర్క్ గుట్టు రట్టు

- సగం ధరకే బ్రాండెడ్ పేర్లతో డ్రగ్స్ మాఫియా
- బెంగళూరులో 90 ఆసుపత్రుల బాగోతం
- సిట్ విచారణలో విస్తుగొలిపే విషయాలు
- ఢిల్లీ రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లో దందా
- హైదరాబాదులోనూ ఉండొచ్చని అనుమానం



మనం ప్రాణాలు కాపాడుకోవడానికి ఆసుపత్రులకు వెళ్తాం. డాక్టర్లు రాసిన మందులు వాడితే రోగం నయమవుతుందని నమ్ముతాం. కానీ, అదే మందులు మన ప్రాణాలను తీసే విషపూరితమైన నకిలీవని తెలిస్తే? క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతున్న రోగులకు, ఐసీయూలో చావుబతుకుల మధ్య ఉన్నవారికి ఇచ్చే ఇంజెక్షన్లను కూడా సగం ధరకే అమ్ముతూ, కొన్ని హాస్పిటల్స్ కొనుగోలు చేశాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బెంగళూరు నుంచి ఢిల్లీ వరకు వ్యాపించిన ఈ దారుణమైన నకిలీ మందుల దందా వెనుక ఉన్న అసలు నిజాలేంటో చూద్దాం. **- సహనం వందే, న్యూఢిల్లీ**

బెంగళూరు నగరంలో వెలుగుచూసిన నకిలీ మందుల వ్యవహారం ఇప్పు దేశవ్యాప్తంగా పెద్ద సంచలనం సృష్టిస్తోంది. ఏదో ఒక చిన్న మెడికల్ షాప్‌లో జరిగే మోసం కాదు ఇది. ఏకంగా 90 ప్రముఖ ఆసుపత్రులు, క్లినిక్‌లకు ఈ కల్తీ మందులు సరఫరా అయ్యాయని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) విచారణలో తేలింది. తవరేకెర ప్రాంతంలోని ఒక రహస్య గోదాముపై జరిగిన దాడితో ఈ ముఠా అసలు రంగు బయటపడింది. ఒక లైసెన్స్ ఉన్న ఫార్మాసిస్టే ఈ నెట్‌వర్క్ వెనుక ప్రధాన సూత్రధారిగా ఉండటం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.

బ్రాండెడ్ కంపెనీల పేరుతో నకిలీలు...

ఈ గ్యాంగ్ చేసిన మోసం సామాన్యమైనది కాదు. మార్కెట్‌లో అత్యంత డిమాండ్ ఉన్న ఫైజర్ ఉత్పత్తులతో పాటు క్యాన్సర్ వ్యాధికి వాడే విలువైన మందులు, ఐసీయూలో అత్యవసరంగా ఇచ్చే ఇంజెక్షన్లను వీరు నకిలీవి తయారు చేశారు.మార్కెట్ ధరపై ఏకంగా 50శాతం డిస్కౌంట్ ఇస్తామని ఆశ చూపించడంతో అనేక ఆసుపత్రులు వీటిని గుడ్డిగా కొనుగోలు చేశాయి. అసలే లక్షల రూపాయల ఖర్చుతో నలిగి పోయే రోగులకు, ఇలాంటి నకిలీ మందులను ఇచ్చి వారి ప్రాణాలతో చెలగాటమాడారు. పదిహేను మందికిపైగా మెడికల్ రిప్రజెంటేటివ్‌లు ఈ నెట్‌వర్క్‌లో భాగస్వాములుగా ఉన్నట్లు ఆధారాలు దొరికాయి. బిల్లులు, ప్యాకింగ్,లైసెన్సులు అన్నీ సక్రమంగా ఉన్నట్లు కనిపించడంతో హాస్పిటల్స్ కూడా వీటిని పసిగట్టలేకపోయాయని అధికారులు చెబుతున్నారు.

దేశవ్యాప్తంగా విస్తరణ...

ఈ నకిలీ మందుల జాడ కేవలం కర్ణాటకకే పరిమితం కాలేదు. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు కూడా ఈ నెట్‌వర్క్ పాకినట్లు దర్యాప్తులో తేలింది. ఇది ఏదో ఒక ప్రాంతంలో జరిగిన చిన్నపాటి నేరం కాదు, దేశవ్యాప్తంగా అల్లుకున్న ఒక పెద్ద ఆర్గనైజ్డ్ క్రైమ్ సిండికేట్. రోగుల బలహీనతను, హాస్పిటల్స్ లాభాపేక్షను ఆసరాగా చేసుకుని వందల కోట్ల రూపాయల నకిలీ వ్యాపారాన్ని వీరు సాగించారు. దేశ రాజధాని ఢిల్లీలో కూడా ఇలాంటిదే ఒక భారీ రాకెట్‌ను పోలీసులు బట్టబయలు చేశారు. అక్కడ క్యాన్సర్ మందుల అక్రమ రవాణాకు సంబంధించి 17 మందిని అరెస్ట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు ఉచితంగా వచ్చే క్యాన్సర్ మందులను దొంగిలించి, బ్లాక్ మార్కెట్‌లోకి మళ్లించడమే కాకుండా, కల్తీ మందులను కూడా సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఇది కేవలం నకిలీ మందుల సమస్యే కాదు, ప్రభుత్వ ధనాన్ని దోచుకోవడం కూడా.

ఢిల్లీ నుంచి రాజస్థాన్ దాకా...

ఢిల్లీ కేసు విచారణ రాజస్థాన్ దాకా వెళ్లడం మరింత ఆందోళన కలిగిస్తోంది. బికనేర్‌లోని ఒక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సిన క్యాన్సర్ మందుల వయల్స్ బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే ఆసుపత్రి వర్గాలు ఈ ఆరోపణలను ఖండించాయి. తమ వద్ద రికార్డులన్నీ పక్కాగా ఉన్నాయని చెబుతున్నాయి. ఏది ఏమైనా ఉచిత మందుల సరఫరా వ్యవస్థలో కూడా ఎక్కడో పెద్ద రంధ్రం పడిందనేది స్పష్టమవుతోంది.

హైదరాబాద్ కేంద్రంగా అనుమానాలు...

హైదరాబాద్, ముంబై వంటి ప్రధాన నగరాల్లో కూడా ఇలాంటి కేసులు ఉండే అవకాశం ఉందని... కాబట్టి విచారణలు తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందని కొందరు స్పష్టం చేస్తున్నారు. క్యాన్సర్ లాంటి వ్యాధితో పోరాడే రోగికి మందు ప్రామాణికత అనేది కేవలం ఒక సాంకేతిక విషయం కాదు, అది వారి జీవన్మరణ సమస్య.

లా స్కూల్ ఆఫ్ రచ్చ రచ్చ

ఉమర్ ఖాలిద్ డాక్యుమెంటరీపై ఏబీవీపీ ఫైర్

- బెంగళూరు నేషనల్ లా స్కూలులో ఉద్రిక్తత
- అమిత్ షా సహా కేంద్ర మంత్రులకు ఫిర్యాదు
- దాన్ని శాశ్వతంగా నిషేధించాలని డిమాండ్



నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ అంటే దేశంలోనే టాప్ క్లాస్ లాయర్లను తయారుచేసే ఒక గొప్ప విద్యాసంస్థ. కానీ అదే క్యాంపస్‌లో ఒక వివాదాస్పద డాక్యుమెంటరీ ప్రదర్శన ఇప్పుడు పెద్ద రాజకీయ దుమారాన్నే రేపింది. "జస్ట్ ఒక సినిమానే కదా, దానికి ఇంత సీన్ అవసరమా?" అని మీకు అనిపించవచ్చు. కానీ, అక్కడ జరిగింది మామూలు రగడ కాదు, ఏకంగా కేంద్ర మంత్రులదాకా ఫిర్యాదులు వెళ్లాయి! అసలు ఆ డాక్యుమెంటరీ వెనుక ఉన్న కథేంటి? ఏబీవీపీ అంతలా ఎందుకు ఆగ్రహం వ్యక్తం చేస్తోంది? ఈ వివాదం వెనుక ఉన్న అసలు రహస్యాలను పరిశీలిద్దాం.

- సహనం వందే, బెంగళూరు

బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీలో వినాయక చవితి రోజున ఒక ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శనకు ఏర్పాట్లు జరిగాయి. లలిత్ వచనీ దర్శకత్వం వహించిన "ప్రిజనర్ నంబర్ 626710 ఈజ్ ప్రజెంట్" అనే చిత్రాన్ని విద్యార్థుల కోసం ప్రదర్శించాలని నిర్వాహకులు భావించారు. అయితే ఈ విషయం బయటకు రాగానే క్యాంపస్‌లో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. చివరికి భద్రతా కారణాలు, పరిపాలనాపరమైన సమస్యలు చూపుతూ ఆ స్క్రీనింగ్‌ను నిర్వాహకులు తాత్కాలికంగా వాయిదా వేశారు.

ఏబీవీపీ ఫైర్...

కానీ, ఈ ప్రదర్శనపై ఆర్ఎస్ఎస్ అనుబంధ విద్యార్థి సంఘమైన ఏబీవీపీ తీవ్ర స్థాయిలో మండిపడింది. కేవలం ప్రజల ఆగ్రహం తగ్గే వరకు సమయం తీసుకోవడానికే ఈ వాయిదా డ్రామాలు ఆడుతున్నారని వారు ఆరోపించారు. తాత్కాలికంగా ఆపడం కాదని, ఈ చిత్రాన్ని క్యాంపస్‌లో ప్రదర్శించకుండా శాశ్వతంగా నిషేధించాలని వారు పట్టుబడుతున్నారు. దేశంలోనే అత్యున్నత చట్ట విద్యను అందించే సంస్థలో ఇలాంటి సంఘటనలు జరగడం పట్ల ఏబీవీపీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది.

కేంద్ర మంత్రులకు ఫిర్యాదు...

ఈ వివాదం కేవలం క్యాంపస్ గొడవగానే మిగిలిపోలేదు, ఏకంగా దేశ రాజధాని ఢిల్లీ తలుపు తట్టింది. ఏబీవీపీ నాయకులు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, అలాగే న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌లకు అధికారికంగా వినతిపత్రాలు పంపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఈ ప్రదర్శనను శాశ్వతంగా రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉమర్ ఖాలిద్ పాత్రపై విమర్శలు...

2016లో జేఎన్‌యూలో జరిగిన వివాదాస్పద సంఘటనలు, అష్ఫల్ గురు స్మారక సభలు, ఆ తర్వాత సీఏఏ, ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల వెనుక ఉమర్ ఖాలిద్ పాత్ర ఉందనేది ప్రధాన ఆరోపణ. 2020లో ఢిల్లీలో జరిగిన అల్లర్ల వెనుక కూడా ఆయన ప్రమేయం ఉందనే కోణంలో దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయి. ప్రస్తుతం ఆయన జైలులోనే ఉన్నారు. ఇలాంటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై రూపొందించిన చిత్రానికి క్యాంపస్‌లో చోటు ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డాక్యుమెంటరీకి మద్దతు...

మరోవైపు ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనను సమర్థిస్తున్న వర్గాలు విద్యా స్వేచ్ఛ గురించి మాట్లాడుతున్నాయి. విశ్వవిద్యాలయాలు అంటే కేవలం పుస్తకాల్లోని పాఠాలు చదవడం మాత్రమే కాదని, సమాజంలోని విభిన్న కోణాలను, భావజాలాలను చర్చించే వేదికలని వారు అభిప్రాయపడుతున్నారు. ఒక డాక్యుమెంటరీని చూడటం అంటే దాని భావజాలాన్ని అంగీకరించడమే కాదని వారి వాదన. అయితే జాతీయ భద్రత విషయంలో ఏమాత్రం ఉపేక్షించకూడదని భావించే వర్గాలు మాత్రం ఈ స్క్రీనింగ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాయి.